# ఎలక్ట్రాన్ (నవ్య నీరాజనం)

**ప్రాశ్నికుడి తొలిపలుకు:** ముడి చమురు అన్వేషణాసంస్థలో 35 సంవత్సరాలు పనిచేసి ఉన్నత స్థాయిలో పదవీ విరమణ చేసిన శ్రీ పింగళి వెంకట రమణరావు 75వ పడిలో కూడా దర్శన ఉపన్యాసకుడిగా పెట్రోలియం టెక్నాలజీ విద్యార్థులకు సంబంధిత జ్ఞాన వితరణ చేస్తున్నారు. 'ఎలక్ట్రాన్' అనే కలం పేరుతో కథలు రాసిన, రాస్తున్న రచయిత ఈయనేనని చాలా కొద్దిమందికి తెలుసు. ఆంధ్రా యూనివర్శిటీ, డెల్టా స్టడీస్ యిన్స్టిటూనిట్‌లో (విశాఖపట్నం) ఆయన్ని కలుసుకొన్నప్పుడు ఓ గంటసేపు మనసు విప్పి మాట్లాడారు. ఆ కబుర్ల ముచ్చట మీతో పంచుకొంటున్నాను. (ప్రచురణ తేదీ: మార్చి 13, 2013)

**శ్రీ పింగళి వెంకట రమణరావుతో (ఎలక్ట్రాన్) ముఖాముఖీ**

**ప్రశ్న:** మీరు ఎలక్ట్రాన్  అనే కలం పేరుతో చాలా కాలంనుంచీ కథలూ  అవీ రాస్తూనే ఉన్నా చాలామంది పాఠకులకు మీ గురించి వివరాలు తెలియవు. కారణం...?

**జవాబు:** పాఠకులకే కాదు, నేనీ కలంపేరుతో కథలు రాస్తున్నానని మా కుంటుంబంలోని వారికే చాలా కాలం వరకూ తెలియదు. కారణం ఒక్క మాటలో చెప్పలేను. ముందుగా నా గురించి క్లుప్తమైన వివరాలు చెబ్తాను. నా పేరు పింగళి వెంకట రమణరావు. జన్మించిన తేదీ 15-12-1937. స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లాలోని పెద్దాపురం. తల్లిదండ్రులు డాక్టర్ పింగళి లక్ష్మీనారాయణప్ప, సుబ్బలక్ష్మి గార్లు. నలుగురన్నదమ్ములలో మూడోవాణ్ణి. మా పెద్దన్నయ్య తర్వాత ఒక సోదరి. నాకు నాలుగో సంవత్సరంలో మా నాన్నగారు దివంగతులయ్యారు. అప్పటికాయన వయసు 36. మా అమ్మగారు తన 94వ సంవత్సరంలో 2005లో దివంగతురాలైంది.

**ప్రశ్న:** మీ  చదువుసంధ్యల గురించి వివరాలు చెప్పండి. రచనల పట్ల ఉత్సాహం ఎలా కలిగింది?

**జవాబు:** నా కలంపేరుకి కారణం చెప్పడంలోనే ఈ మీ ప్రశ్నకు కూడా సమాధానం లభిస్తుంది. అక్షరాభ్యాసం నుంచీ హైస్కూల్ చదువు వరకూ పెద్దాపురంలోనే కొనసాగింది. ప్రాథమిక విద్య పురపాలక సంఘం బడుల్లోనే జరిగింది. నాకు అక్షరాభ్యాసం చేయించిన సత్యవోలు సత్యన్నారాయణగారు ఆ పాఠశాలల్లోనే పని చేసేవారు. నా గురించి ఆయన అభిప్రాయం: 'రవణా! నీ రాత బాగానే ఉంటుంది కానీ దస్తూరీ కాదు! సమాధానాలు క్లుప్తంగానూ, సమగ్రంగానూ ఉండాలి. లేకపోతే దిద్దేవాడి బుర్ర బద్దలైపోతుంది'. ఇది నాకు రచనా వ్యాసంగంలో తొలి పాఠం. అయిదో క్లాసయిన తర్వాత శ్రీ వీర్రాజు మాధ్యమిక పాఠశాలలో చేరాను. మల్యాల జయరామయ్యగారని మాకు చరిత్ర పాఠాలు చెప్పేవారు. పరీక్షల్లో సమాధానాలు సరిగా రాసినా అక్షరదోషాలుంటే నిర్దాక్షిణ్యంగా మార్కులు కోసేసేవారు. అలాగే యింగ్లీషు చెప్పే మా ప్రధానోపాధ్యాయులు ఎర్రా సుబ్బలింగం గారు కూడా భాష విషయమై చాలా పట్టింపుగా ఉండేవారు. ఒకసారి నా సహాధ్యాయుని

తండ్రి రాసిన ఓ కాఫీ హొటల్ బోర్డులోని స్పెల్లింగ్ దోషం గమనించి, 'మీ నాన్న తప్పు రాస్తుంటే చెప్పాల్సిన బాధ్యత నీదే!' అని చాలా గట్టిగా మందలించారు. అలాంటి గురువుల మూలాన మాకు ఆంగ్ల, తెలుగు భాషలమీద పట్టు ఏర్పడింది. జయరామయ్య మేష్టారు ఛందోబద్ధమైన పద్యాలు రాసేవారు. ఓసారి తలకిందులుగా తపస్సు చేసి ఓ పద్యం రాసి ఆయనకి చూపించాను. దాని కాయన 'నీకు కవిత్వం రాయడం రాదు. వ్యాసాలు బాగా రాస్తావు. వాటిపై కేంద్రీకరించు. అయినా యిప్పట్నుంచీ ఈ గొడవలన్నీ ఎందుకు, చదువుమీద దృష్టి సారించు' అని హితవు పలికారు. ఎనిమిదో తరగతి తర్వాత మా ఊరి ఉన్నత పాఠశాలలో చేరాను. పోతాప్రగడ వెంకటేశ్వర్లు, భగవచ్ఛాత్రి, భళ్ళమూడి రామ్మూర్తి, దత్తు గార్ల లాంటి ఉపాధ్యాయులు శ్రద్ధతో పాఠాలు చెప్పేవారు. తెలుగు వ్యాస రచన పోటీల్లో మొదటి బహుమతి ఎప్పుడూ తప్పక వచ్చేది. ఆంగ్ల వ్యాస రచన పోటీల్లో నా స్నేహితుడు రాయవరపు కామరాజు నన్ను అప్పుడప్పుడూ రెండో బహుమతికి దింపేసేవాడు.

**ప్రశ్న:** అంటే మీరు హైస్కూలు స్థాయినుంచే కథలు రాసేవారా?

**జవాబు:** నేను 1953లో రాజమండ్రి ప్రభుత్వ కళాశాలలో యింటర్ మొదటి సంవత్సరం చదువుతున్నప్పుడు మా మేనత్త గారబ్బాయి ఏలూరునుంచి వచ్చి, 'ఒరేయ్, నీకు వ్యాసాలు రాయడం బాగా వచ్చు కదా? నేనో యితివృత్తం చెప్తాను నువ్వు కథ రాయి!' అన్నాడు. ఆగష్టు నెలలో వరద గోదావరి గట్లు తెగి ప్రవహించి రాజమండ్రిలో బీభత్సం సృష్టించింది. మా కొత్త కాలేజీ భవనాల్ని వరదబాధితులకు శరణ శిబిరాలుగా మార్చేశారు. కావల్సినంత సమయం. మూడురోజుల్లో కథ రాశాను. దాన్ని మా వాడు ఆంధ్రపత్రిక వారపత్రికకు పంపాడు. రెండు నెలల్లో అది ప్రచురితమైంది. పన్నెండు రూపాయల పారితోషకం అతనికి పంపిస్తే నాకు ఆరు రూపాయలు పంపించాడు. ఆ ఆరు రూపాయలతో ఓ కళ్ల డాక్టరుగారి వద్ద నా కళ్లు పరీక్ష చేయించుకొన్నాను. కళ్లజోడు ధరించడం ప్రారంభమైనది అప్పుడే. ఆ ఊపుతో రెండో కథని రాయడానికి పూనుకొన్నాను. అప్పుడు రాజమండ్రిలో న్యాయవాది వృత్తి చేస్తున్న మా పెద్దన్నయ్య (అప్పటికి ఆయన వివాహితుడు కాదు) నన్ను బాగా చివాట్లు వేశాడు– 'నువ్విలా కథలు రాసేవ్యామోహంలో పడిపోతే చదువు కొండెక్కుతుంది. నీ రచనా వ్యాసంగం కాలేజీ మ్యాగజైన్‌కే పరిమితం చెయ్యి!' అని. రాజమండ్రి కాలేజీలో యింటర్, బి.ఎస్‌సి, చదివిన నాలుగు సంవత్సరాలలోనూ వార్షిక పత్రికలో నా రచనలు ముద్రితమయ్యాయి. అప్పుడు మా కాలేజీలో తెలుగు విభాగంలో పని చేసే చామర్తి కనకయ్యగారు (కనక్ ప్రవాసి) నాకు తగు ప్రోత్సాహమిచ్చారు. ఆయన అప్పటికే కథకునిగా పేరొందారు. కాలేజీ తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎమ్.ఎస్‌సి (అప్లయిడ్ ఫిజిక్స్–ఎలక్ట్రానిక్స్) చదివి 1960లో విజ్ఞాన శాస్త్రంలో స్నాతకోత్తర పట్టా చేబట్టాను (అది మూడేళ్ల కోర్సు. స్వోత్కర్ష కాదుకానీ– ప్రథమ తరగతి లభించిన విద్యార్థిని నేను ఒక్కణ్ణే). వెంటనే అప్లయిడ్ ఫిజిక్స్ విభాగంలో చేరి ఓ మూడునెలలు డిమాన్‌స్ట్రేటర్‌గా పని చేశాను. నవంబరులో ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమిషన్‌లో చేరాను. చేరిన వెంటనే కలాన్ని కదిల్చాను. ముందుగా 'రావు' అనే కలంపేరుతో కథలు రాశాను. అవి ఆంధ్రపత్రిక, ప్రభలలో

తరుచుగా ప్రచురితమయ్యేవి. నేను చదివిన చదువు ఎలక్ట్రానిక్స్ కావడం, చేసే ఉద్యోగంకూడా ఎలక్ట్రానిక్ పరికరాలకి సంబంధించింది కావడం, మీదు మిక్కిలి మా పెద్దన్నయ్యగారి మందలింపు మదిలో యిరుక్కుపోవడం కారణంగా 'ఎలక్ట్రాన్' అనే కలం పేరుతో అజ్ఞాతంగా రచనలు ప్రారంభించాను. ఇంత సోది చెప్పే బదులు 'నా కథలు పాఠకులకి రుచించకపోవడం మూలాన నా గురించి తెలుసుకోడానికి ఎవరూ కుతూహలం చూపించలేదంటే' సమాధానం నచ్చుతుందేమో? (నవ్వు)

**ప్రశ్న:** అలాగని ఎందుకనుకోవాలి? మీరు అజ్ఞాతంగా ఉండిపోవాలనుకొన్నారు, ఉండిపోయారు. ఒకమాట చెప్పండి. మౌలికంగా పఠనాసక్తి ఉంటేకానీ రచనలకి ఎవరూ పూనుకోరు కదా? కథారచన పట్ల ఈ రకమైన ఆసక్తి ఎలా కలిగింది?

**జవాబు:** నేను చిన్నప్పట్నుంచీ పత్రికలు చదివేవాణ్ణి. మా ఊరి పురపాలక సంఘ గ్రంథాలయం మా పింగళి వారి ఉరఫ్ ప్లీడర్ల వీధిలోనే ఉండేది. సాయంకాలం స్కూలయిపోగానే యింటికి వచ్చి, నేనూ, నాస్నేహితుడు కామరాజూ గ్రంథాలయానికి పరుగులు తీసేవాళ్లం. ప్రాథమిక పాఠశాలలోని జాన్ గారనే మాస్టారు దాన్ని నిర్వహించేవారు. వెళ్లగానే ముందుగా ఆరోజు దినపత్రిక చదవమనేవారు. తర్వాతనే పుస్తకాల్ని ముట్టనిచ్చేవారు. బెంగాలీ నుంచి అనువదింపబడిన అపరాధపరిశోధన నవలల పని పట్టించేవాళ్లం. ఒక్కోసారి ఆయనకి ఏదైనా పనుంటే లైబ్రరీని చూసుకోమని మాకు తాళాలిచ్చేవారు. పెద్దవాళ్ల పుస్తకాలకి ఓ బీరువా ఉండేది. ఒకసారి తాళాలు మా చేతికి వచ్చిన రోజున ఆ బీరువా తెరిస్తే అందులో చలం, జంపన చంద్రశేఖరరావు, కొవ్వలి నరసింహారావుల పుస్తకాలు పుష్కలంగా కనబడ్డాయి. చెరోటీ తీసుకొని చదివేలోగా జాన్ మాస్టారు మమ్మల్ని పట్టుకొని, 'భడవల్లారా! ఈ పుస్తకాలు మీకు కాదు. చరిత్ర పుస్తకాలున్నాయి. శాస్త్రవిజ్ఞానం మీద పుస్తకాలున్నాయి. అంతగా మీకు నవలలు చదవాలంటే బోల్డంత శరత్ సాహిత్యం ఉంది. వాటిని చదవండి' అని తీవ్రస్థాయిలోనే మందలించారు. చక్రపాణి, బొందలపాటి శివరామకృష్ణలు అనువదించిన పుస్తకాల్ని చదివాం. అయితే ఆ సాహిత్యంలోని లోతు పాతులు అర్థం చేసుకొనే వయసు కాదు మాది. విశ్వనాథ సత్యనారాయణగారి ఏకవీరలాంటి నవలలు ఆసక్తికరంగా ఉండేవి. ఆ కాలంలోనే పత్రికలో నండూరి రామమోహనరావుగారు అనువదించిన ట్రెజర్ ఐలండ్ 'కాంచన ద్వీపం' పేరుతో ఆంధ్రపత్రికలో ధారావాహికంగా వచ్చేది. సూరంపూడి సీతారాంగారు అనువదించిన కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో, తెన్నేటి సూరి అనువదించిన టేల్ ఆఫ్ టు సిటీస్ ధారావాహికల్లావచ్చేవి. మా పెద్దన్నయ్యని యింగ్లీషు సాహిత్యాన్ని బాగా చదివేవాడు. స్టాన్లీ గార్డనర్ పెర్రీమెసన్ నవలలనుంచి మామ్, ఆలెగ్జాండర్ డ్యూమాస్, ఛార్లెస్ డికెన్స్, వోడ్‌హౌస్, అప్టన్ సింక్లైర్, వగైరా వగైరా రచయితల పుస్తకాలు మా చేత సెలవుల్లో చదివించేవాడు. నెమ్మదిగా నడిచే ఆధ్యాత్మికపరమైన పుస్తకాలంటే అంతగా అభిరుచి ఉండేది కాదు. తదుపరి కాలంలో చాలా ఉత్కంఠభరితంగా రాసే యిర్వింగ్ వాలెస్, రాబర్ట్ లుడ్లుం, ఎలైస్టెర్ మెక్లేన్, జేమ్స్ హాడ్లీ ఛేజ్ రచయితల ఎన్నో పుస్తకాలు

చదివాను. వాటిలో ఏముందని కొట్టిపారేసేవారు చాలామందే ఉన్నారు. కానీ పాఠకుడిని విసుగెత్తించకుండా, పేజీలు తిప్పేయకుండా ప్రతి పదాన్నీ చదివించే కథనం నాకు చాలా బాగా నచ్చుతుంది. మనసు తేలిక పడాలంటే అలాంటి పుస్తకాలని చదవడం మంచిదని నా అభిప్రాయం.

**ప్రశ్న:** అలాంటి రచయితలు మన తెలుగువారిలో లేరా? తెలుగు కథని గురించి మీ అభిప్రాయమేమిటి?

**జవాబు:** ఇది చాలా యిబ్బందికరమైన ప్రశ్న! ఉన్నారు కానీ, పరిశోధన లేకుండా అభూత కల్పనలతో రాసిన నవలలే ఎక్కువ. కానైతే  తెలుగులో నవ్యతతో తర్కభరితమైన స్థాయిని తీసుకొచ్చిన రచయిత నిస్సందేహంగా యండమూరి వీరేంద్రనాథ్ అని చెప్పుకోవచ్చు. మల్లాది వెంకటకృష్ణమూర్తి కూడా మంచి నవలలు రాశాడు. విదేశీయుల జీవిత వాతావరణం, జీవనవిధానం చాలా విస్తృతమైన కారణంగా వారి కథావస్తువులు కూడా చాలా వైవిధ్యభరితంగా ఉండి ఉత్కంఠ రేకెత్తిస్తాయి.

**ప్రశ్న:** ప్రస్తుత తెలుగు కథకుల గురించి మీ అభిప్రాయం?

**జవాబు:** ప్రతి పత్రికనీ చదవడం సాధ్యంకాదు. అలానే వచ్చిన ప్రతి పుస్తకం కూడా చదవడం సాధ్యంకాదు. కాని అధ్యయనం చేసినంత మేరకు నాకు 1950-70లలో అవసరాల రామకృష్ణారావు, మధురాంతకం రాజారాంగార్ల కథలు నచ్చేవి. వారి కథలు మంచినీటి ప్రవాహంలా కొనసాగుతాయి. చాలా తక్కువ రాసినా సి. రామచంద్రరావుగారి కథలు చాలా చక్కటివి. ఆ కథల వాతావరణమే వేరు. అలాగే ఇచ్ఛాపురపు జగన్నాథరావుగారి కథలు కూడా సమాజంలోని ఉన్నత వర్గాలవారికీ సమస్యలుంటాయని ధైర్యంగా చెప్తాయి. ఇటీవలి కాలంలో కవనశర్మ, వసుంధర, విహారిలు తెలుగు కథకు కొత్త అందాలు తీసుకొచ్చారు.

**ప్రశ్న:** రావి శాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావు గార్ల కథలపై మీ అభిప్రాయం?

**జవాబు:** నేను ఉత్తర భారతంలో దాదాపు నలభైసంవత్సరాలు గడిపాను. అందుచేత అందిన పత్రికల్లోని కథలుచదవడమే తప్ప, అందరి పుస్తకాలూ చదివే అవకాశం దొరకలేదు. ఒకరిద్దరు అటు ఆంగ్లంలోనూ, యిటు తెలుగులోనూ 'వారి పుస్తకాలు చదవలేదా, వీరి పుస్తకాలు చదవలేదా' అని నవ్వుతాలుగా ఎద్దేవా చేసేవారు. చలం, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, రావిశాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావు, బీనాదేవిల సాహిత్యం నేను యిటీవలి కాలంలోనే చదివాను. చదివిన తర్వాత నాకనిపించింది- 'చదవకపోవడమే మంచిదైంది. చదివితే రెండువిషయాలు జరిగేవి. ఒకటి వారిలా రాయాలన్న తపనతో వారి శైలిని అనుకరించడం. లేదా వారిలా రాయలేం కనక రాయకపోవడం మంచిది అన్న నిర్ణయానికి రావడం'. తిరుగు సమాధానం వారికిదే చెప్పాను కూడా. తెలుగు కథకి వీరందరూ ఓ ఒరవడి దిద్దారు. ముళ్లపూడి కథకి కొత్తభాష్యాలు చెప్పాడు. వారు రాసినలాంటి కథలు రావటల్లేదు.

**ప్రశ్న:** అంటే వారి తర్వాత తెలుగు కథ ఆశించినంత స్థాయిలో లేద్య మీ అభిప్రాయమా?

**జవాబు:** అలా అని అనలేను. చాలామంది రచయితలు రాస్తున్నారు. ఇది చాలా సంతోషించదగ్గ

విషయం. కానైతే వస్తువైవిధ్యం లేకుండా మన కథలన్నీ కొన్ని కోణాలకే పరిమితమైపోవడం వల్ల నవ్యత గోచరించటల్లేదు. చాలా కథలు నాటకీయంగా, కృతకంగా ఉంటున్నాయి. ఆంగ్లపదాల వాడుక విశృంఖలంగా జరుగుతోంది. ఇది హర్షణీయంకాదు.

**ప్రశ్న:** మీ దృష్టిలో కథ అనేది ఎలా ఉండాలి?

**జవాబు:** కథకి పద్యంలా ఛందస్సు లేదు. వ్యాసానికీ, కథకీ వాక్యనిర్మాణం మొదటి ప్రాణం. వాక్యానికి వ్యాకరణం ప్రాణం. శుద్ధగ్రాంధికం, సరళ గ్రాంథికం, వ్యావహారికం యివి భాషాంతరాలు. వ్యావహారికంలో మాండలీకాలు ప్రస్ఫుటంగా ఉంటాయి. సరళీకృతమైన వ్యావహారికం పాఠ్యపుస్తకాలకి అమలు పరిచినట్లే కథలు కూడా సరళీకృతమైన వ్యావహారిక భాషలో ఉండాలని నా అభిప్రాయం. లేకపోతే పఠనీయత ప్రాంతాలకే పరిమితమైపోతుంది. వాదాలచుట్టూ, ఆశయాల చుట్టూ బలవంతంగా అల్లే కథలు యిందాకా చెప్పినట్లుగా నాటకీయంగా, కృతకంగా ఉంటాయి. రాసేవారికీ, చదివేవారికీ ప్రసవవేదన ఉండకూడదు. వాద్యఘోషలో పాట మునిగిపోకుండా– విషాదగీతమైనా, వినోద గీతమైనా మనోజ్ఞమైన బాణీలో వినిపించే ఓ.పీ. నయ్యర్ సంగీతంలా కథ సాగిపోవాలి. విమర్శకుల మెప్పుకోసం రాసే కథలు పాఠకులకు నచ్చకపోవచ్చు. అలాగే పాఠకుల మెప్పుకోసం రాసే కథలు విమర్శకులకు నచ్చకపోవచ్చు. నా మట్టుకు నేను నాకు నచ్చిన విషయంపై, నాకు వచ్చిన రీతిలో కథలు రాస్తాను. పత్రికా సంపాదకులకి నచ్చుతూనే ఉన్నాయి. అడపా తడపా బహుమతులు వస్తూనే ఉన్నాయి.

**ప్రశ్న:** మరి మీ కథలు పాఠకుల ఆదరణకి నోచుకొంటున్నాయో లేదో తెలియకపోతే రచయితగా మీకు సంతృప్తి కలిగేదెలా?

**జవాబు:** 'ఫలానా అందాలతార ముఖచిత్రంతో వచ్చిన పత్రిక చూడముచ్చటగా ఉంది. అందులోని కథలూ, వ్యాసాలూ చాలా బావున్నాయని' ఎవరి లేఖయినా ప్రచురించారనుకోండి. అందులో నా కథ పడి ఉంటే ఆ పాఠకుడి ఆనందాన్ని నా కథకీ అన్వయించుకోవాలంతే ! (నవ్వు). మీరన్న మాట నిజం. ప్రచురితమైన కథల్ని పాఠకులు విశ్లేషించే అవకాశాన్ని పత్రికలు తగినంతగా యివ్వటల్లేదు. అస్సాంలో పని చేసేటప్పుడు చందాలు కట్టినా సగానికి పైగా సంచికలు తపాలావారి ఆధ్వర్యంలో దారి తప్పేవి. ఒక్కోసారి పారితోషికం అందిన తర్వాత కథ ప్రచురితమైనదన్న సంగతి తెలిసేది. ఇక పాఠకుల అభిప్రాయాలు తెలిసేదెలా? అయితే యిటీవలి కాలంలో నవ్యలాంటి కొన్ని పత్రికలు చిరునామాలూ, సెల్‌ఫోన్ నెంబర్లూ యివ్వడంతో పాఠకులు స్పందిస్తూనే ఉన్నారు. నవ్యలో ప్రచురితమైన పారిభద్రవిజితి అన్న కథలో ఒక చిన్న పదం వాడినందుకు ఓ పాఠకురాలు నన్ను ఫోన్‌మీద అరగంటసేపు నిలదీశారు. ఆ సంభాషణ చాలా విజ్ఞానదాయకంగా జరిగింది.

**ప్రశ్న:** ఏమైనా, ఓ స్థాయి గుర్తింపు రావాలన్న ఆశ రచయితకుంటుంది కదా?

**జవాబు:** ఇదీ నిజమే. నా అనుభవమై ఓ విషయం చెబ్తాను. నేను 69లో జమ్మూలో ఉన్నప్పుడు యువ

మాస పత్రికలో 'కల' అనే చిన్న కథ పడింది. 50 రూపాయల పారితోషికం పంపుతూ మనిఆర్డరు ఫారంలో దిగువున 'మా పత్రికలో పెద్దకథలకు కూడా తావుంటుంది' అన్న ఒక్క వాక్యం రాసి చక్రపాణిగారు సంతకం చేశారు. ఆ తర్వాత నేను యువకి పంపిన ఏ కథా తిరిగి రాలేదు. నా మొదటి నవలిక కూడా యువలోనే పడింది. చక్రపాణిగారు కీర్తిశేషులైన తర్వాత యువ వారు ప్రదానం చేసిన మొట్టమొదటి చక్రపాణి అవార్డు నా కథకు లభించింది. అది పోటీకి పంపిన కథకాదు. 1977 సంవత్సరంలోని పన్నెండు నెలల్లో ప్రచురితమైన కథల్లోంచి ఎంపిక చేసి యిచ్చిన బహుమతి. న్యాయనిర్ణేతలు ఇచ్ఛాపురపు జగన్నాథరావు, యద్దనపూడి సులోచనారాణిగార్లు. అప్పుడు నేను అహ్మదాబాద్‌లో పని చేస్తున్నాను. హైదరాబాద్ హొటల్ సరోవర్‌లో బహుమతి ప్రదానం చేశారు. అప్పుడే నేను కథలు రాస్తానని మా యింట్లోవాళ్లందరికీ తెలిసింది. ఫర్వాలేదు, పెద్దలు గుర్తించారన్న సంతోషం కలిగింది. అహ్మదాబాద్ ఆంధ్రమహాసభకోసం రెండు మూడు నాటికలు రాసి దర్శకత్వం చేబట్టాను. అంతర్జాతీయ బాలల సంవత్సరం 1977లో తెలుగురాని పిల్లలచేత తెలుగులో నాటకం వేయించాను. సన్నివేశం చెప్తే సంభాషణలు వాళ్లే చెప్పుకొన్నారు. దాన్ని బరోడాలో మళ్లీ ప్రదర్శించాం. అలాగే 1973లో డెహ్రాడూన్‌లో ఉన్నప్పుడు అన్నీ స్త్రీ పాత్రలతో 'లాంఛనాలు' అనే హాస్య నాటికను రాశాను. దాని ప్రదర్శన చాలా బాగా జరిగింది. దాన్ని తర్వాత ఆంధ్రప్రభ ప్రచురించింది. కొచ్చిన్ ఆంధ్రులు ఆ నాటికని అక్కడ ప్రదర్శించారు. ఏ చెట్టూ లేనిచోట ఆముదపుచెట్టే మహావృక్షమన్నట్టుగా యిదీ ఒక గుర్తింపే కదా? మధ్యలో ఉద్యోగభారం చేత 1980 నుంచి రచనా వ్యాసంగానికి స్వస్తి పలికేశాను. 1995 డిసెంబరులో పదవీ విరమణ చేసిన తర్వాత ఇంతవరకూ రచన మాసపత్రికకు చందాదారుణ్ణిగా ఉన్న నేను 1996 లో నా మొదటి కథ రచనకి పంపాను. వారంలో రచన శాయిగారి వద్దనుంచి ఓ పోస్ట్‌కార్డు వచ్చింది. 'మీరు మొదటిసారిగా పంపిన కథ అందినది. త్వరలోనే ప్రచురించబడ్తుంది. యువ, యితర పత్రికలలో పడ్డ మీ కథల కటింగ్‌లు నావద్ద చాలానే ఉన్నాయి.....” అని. మరుసటి నెల పత్రికలోనే ఆ కథని ప్రచురించారు. అంతకు మించిన గుర్తింపు ఏం కావాలని? 15 ఏళ్లు పట్టాలు తప్పిన నా రచనా వ్యాసంగాన్ని ఆయన ఆ ఒక్క ఉత్తరంతో తిరిగి పట్టాలమీద నిలబెట్టారు. అసంపూర్తిగా వదిలేసిన నా రచనల్ని చదివిన నా సహోద్యోగి శ్రీ పాలెపు బుచ్చిరాజు నా పదవీ విరమణ తర్వాత బరోడా నుంచి వారానికి రెండుసార్లు ముంబయ్ ఫోన్ చేసేవాడు. సంతకాలు పెట్టడానికి అలవాటైన కలాన్ని సాహిత్యంవైపు మళ్లీ మళ్లించడానికి ఆయన కూడా కారకుడు. రచన శాయిగారికీ, పాలెపు బుచ్చిరాజుగారికీ నేను సర్వదా కృతజ్ఞుణ్ణి.

**ప్రశ్న:** ఏమైనా కథాసంకలనాలు తీసుకువచ్చారా?

**జవాబు:** వాహినీ బుక్‌ట్రస్ట్‌వారి ఆధ్వర్యంలో నేలమీది నక్షత్రాలు, జనారణ్యం, విలువల వెల ఎంత, ముళ్లకుర్చీలు అన్న నాలుగు సంకలనాలు వెలువడ్డాయి.

**ప్రశ్న:** ముందుముందు యింకా ఏమైనా సంకలనాలు తీసుకు వస్తారా?

**జవాబు:** పత్రికలలో ప్రచురింపబడ్డ దాదాపు అరవై కథలూ, మూడు నవలికలూ ఉన్నాయి. మరోసారి వెలుగుచూసి పుస్తక వితరణకోసం, ఏవో నాలుగైదు గ్రంథాలయాలు చేరడానికీ, పుస్తకాల షాపుల్లో వెనక అరల్లో మగ్గడానికీ అవి ఎదురు చూస్తున్నాయి. కాలం కలిసి రావాలి కదా?

**ప్రశ్న:** మీ ఉద్యోగ వివరాల గురించి నాలుగు మాటలు....

**జవాబు:** ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమిషన్‌లో అన్వేషణా విభాగంలో చేరిన తర్వాత దేశంలోని వివిధ రాష్ట్రాలలోని ముడి చమురు స్థావరాల్లో, వివిధ స్థాయిల్లో పని చేశాను. అస్సాం, బెంగాల్, ఉత్తర్‌ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, గుజరాత్, మహారాష్ట్రలలో మొత్తం తొమ్మిది సార్లు అటూ యిటూ బదిలీల మీద వెళ్లి నివసించాను. 1962లో చైనా వారి దురాక్రమణ జరిగినప్పుడు అస్సాంలో ఉన్నాను. 1971లో పాక్‌తో జరిగిన యుద్ధాన్ని జమ్మూలో ఉన్నప్పుడు స్వయంగా చూశాను. బాంబుల వర్షం కురుస్తున్నప్పుడు ట్రెంచ్‌ల్లో దూరాము. దేశంలోని ఉత్తర రాష్ట్రాలలో పనిచేయడంవల్ల జాతీయదృక్పథం, స్వరూపం అవగాహనకొచ్చింది. నా కథల్లో ఈ అంశం కానవస్తుందనే అనుకొంటాను. అమెరికా యూరోపుదేశాలు ఉన్నత తర్ఫీదు కోసమనీనూ, ఉద్యోగరీత్యానూ అయిదు సార్లు సందర్శించడం జరిగింది. రష్యన్లతోనూ, అమెరికన్లతోనూ కలిసి పనిచేయడం వల్ల శ్రామిక గౌరవానికి ఉన్న విలువ తెలిసింది. చివరగా దేశంలో అత్యధిక ముడి చమురుని ఉత్పత్తి చేసే ముంబయ్ సముద్ర ప్రోజెక్ట్ అన్వేషణాధిపతిగా, గ్రూప్ జనరల్ మేనేజర్‌గా 1995 డిసెంబరు 31న పదవీ విరమణ చేశాను.

**ప్రశ్న:** ఆ పైన కేవలం రచనా వ్యాసంగంలోనే సమయం గడిపేస్తున్నారనుకొంటాను?.

**జవాబు:** లేదు. నేను పని చేసిన విభాగం చాలా కీలకమైనది. దాని తాలూకు విజ్ఞానం కేవలం కంపెనీల డాక్యుమెంట్లకే పరిమితం. ఇటీవలి కాలంలో చాలా విద్యాసంస్థలు పెట్రోలియమ్ టెక్నాలజీలో కోర్సులు ప్రారంభించాయి. ముంబయ్‌లోని యిన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ అండ్ గ్యాస్ ప్రొడక్షన్ టెక్నాలజీ, మహారాష్ట్రా యిన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, పూణే, డెల్టా స్టడీస్ యిన్‌స్టిట్యూట్, ఆంధ్రా యూనివర్శిటీ, విశాఖపట్నం, బరంపూర్ యూనివర్శిటీలలో దర్శకోపన్యాసకుడిగా పలుమారులు సందర్శించాను. రోజూ కొంత సమయం నేను పనిచేసిన ప్రత్యేక విభాగం తాలూకు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని పుస్తక రూపంలో రాస్తున్నాను.

**ప్రశ్న:** మీ కుటుంబాన్ని గురించి కూడా....

**జవాబు:** నా సతీమణి అన్నపూర్ణ. పెద్దవాడు శంకర్ ముంబయ్ భారత్ పెట్రోలియమ్ రిఫైనరీలో మెయింటెనెన్స్ యింజనీర్. రెండవ వాడు గోపాల్ పీడియాట్రిక్ సర్జన్. హనమకొండలో ప్రాక్టీస్. పెద్దవాడికిద్దరు కూతుళ్లు. రెండవవాడికి ఒక కూతురు. కోడళ్లిద్దరూ విద్యాధికులే అయినా గృహిణులుగానే ఉన్నారు.

**ప్రశ్న:** ఆనవాయితీగా అభిమాన నటుల్ని గురించీ......?

**జవాబు:** ఇందాకనే చెప్పాను నాకు ఓ.పి. నయ్యర్ సంగీతం యిష్టమని. అస్సామీ గాయకుడు కీ.శే.

భూపేన్ హజారికా, అస్సామీ గాయకురాలు దీపాలీ బోర్తాకుర్, కీ.శే. భానుమతి, ఎస్,పిలు నేను అభిమానించే గాయకులు. హాస్యనటులు బ్రహ్మానందం, ఎమ్.ఎస్. నారాయణలుంటే ఆ చిత్రాలు చూడ్డానికి యితర కారణాలు ఆలోచించను. మాటవిరుపుతో సంభాషణలకు వన్నె తెచ్చిన కీ.శే. ఎస్. వి. రంగారావన్నా, మొహం బిగపెట్టకుండా సహజధోరణిలో సంభాషణలు చెప్పే కీ.శే. అశోక్ కుమార్ అన్నా, గ్లిసరిన్ లేకుండా తను కన్నీళ్లు కార్చి, ప్రేక్షకుల్ని కంట తడిపెట్టించే అంజలీదేవి అన్నా, కీ.శే, నూతన్ అన్నా నాకు అభిమానం. యిర్వింగ్ వాలెస్ నవలలన్నా, జెఫ్రీ ఆర్చెర్ కథలన్నా నాకు చాలా యిష్టం.

**ప్రశ్న:** మన తెలుగు రచయితలలో మీరు అభిమానించేవారు?.

**జవాబు:** చాలామంది పేర్లే చెప్పానుగా!

**ప్రశ్న:** చివరగా మీరిచ్చే సందేశం ఏదైనా ఉందా?

**జవాబు:** మా తరం వాళ్లందరకీ స్కూల్ ఫైనల్ (పదకొండో తరగతి) వరకూ ఒక్క యింగ్లీషు మినహా మిగిలిన అన్ని పాఠ్యాంశాలూ తెలుగులో ఉండేవి. ఇంటర్‌లో చేరిన వెంటనే ఒక్క తెలుగు తప్ప మిగిలిన పాఠ్యాంశాలనీ్న యింగ్లీషులోనే ఉండేవి. మాకు ఏ విధమైన యిబ్బందీ కలగలేదు. బి.ఎస్.సి.లో యింగ్లీష్ ఒక పాఠ్యాంశంగా ఉండేది. దేశ విదేశాల్లో ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉండాలంటే ఆంగ్లభాషా పరిజ్ఞానం అవసరమన్నది నిర్వివాదాంశం. అలాగని తెలుగుని కాని, యితర రాష్ట్రాలలో వారివారి భాషల్ని కాని అశ్రద్ధ చేయడం సరి కాదు. వందల సంవత్సరాల చరిత్రకల భారతీయ భాషల సాహిత్యం పదికాలాలపాటు నిలవాలంటే భాష పటిష్టంగా ఉండాలి. దానికి ప్రాథమిక దశనుంచీ పునాదులు గట్టిగా ఉండాలి. నేను ప్రస్తావించిన గురువులందరూ అలాంటి పునాదులు వేసిన వారే. ఎందరో శాస్త్రజ్ఞులూ, సాంకేతిక నిపుణులూ, యితరత్రా–పాలనా యంత్రాంగంలోని ఉన్నతాధికారులూ చక్కటి తెలుగు రాస్తున్నారు. రచయితలు దూరదర్శన్ వాహినీ వ్యాఖ్యాతల భాషని కథల్లోకి దింపకుండా కృషి చెయ్యడం ఎంతైనా అవసరం. ఓ రచయితగా, ప్రవాసాంధ్రుడిగా నలభైసంవత్సరాలు రాష్ట్రం బయట నివసించిన వ్యక్తిగా యింతకంటే ఏం చెప్పగలను?

**ప్రాశ్నికుడి తుది పలుకు:** ఓ సాంకేతిక నిపుణుడిగా బాధ్యతలు నిర్వహిస్తూనే తెలుగు సాహిత్యానికి మీవంతు కృషిచేసారు. అభినందనలు. మీరు రాస్తున్న ఆ పుస్తకాన్ని త్వరలోనే విద్యార్థులకందచేస్తారని ఆశిస్తున్నాను. రేపటి పాఠం చెప్పడానికి మీరు తయారౌతున్న సమయంలో యిబ్బంది పెట్టాను. ధన్యవాదాలు.

**(మస్తాన్ రెడ్డి)**